

బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అదే యాజమాన్యంలో అంతర్ జిల్లా బదిలీలకు అనుమతి ఇస్తూ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేశారని డీఈవో షంషుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31 తేదీ నాటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఈ అంతర్‌జిల్లా బదిలీలకు ఈనెల 24వ తేదీ సోమవారం లోపు లీప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మార్గదర్శకాలు, అవసరమైన ప్రొఫార్మాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కడపడిఇఒ.ఇన్‌లో ఉన్నాయన్నారు.

మట్టి విగ్రహాలను వాడుదాం

● పర్యావరణాన్ని కాపాడుదాం ● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేశ్ విగ్రహాలను వాడి, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపు నిచ్చారు. వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరం సమిష్టిగా కృషి చేయడం వల్ల గొప్పమార్పులు సాధించవచ్చన్నారు. మట్టితో విగ్రహాలను ఉపయోగించడం ద్వారా ఆర్థికంగా కొంత వెసులుబాటు కూడా కలుగుతుందన్నారు. వినాయక ఉత్సవాలను పర్యావరణానికి అనుకూలంగా జరుపుకుందామన్నారు. చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే పదార్థాల వినియోగం తగ్గిద్దామన్నారు. చెరువులు, జలాశయాలు, జీవరాశుల మనుగడ ముఖ్యమని, వాటిని సంరక్షించు కోవడం మనందరి బాధ్యత అన్నారు. విగ్రహాల అలంకరణకు ప్లాస్టిక్, థర్మోకోల్ వంట వస్తువులు వాడటం వలన జలవనరులు కలుషితమవుతాయన్నారు. విగ్రహాల తయారీకి సహజసిద్ధమైన రంగులను, ప్రకృతిలో లభ్యమయ్యే పత్తి, నార వంటి పదార్థాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రశాంత ఉత్సవాలకు సహకరించండి

● ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగ ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుశాఖకు ప్రజలు సహకరించాలని ఎస్పీ అశోక్‌కుమార్ కోరారు. జిల్లాలో వినాయక ఉత్సవాలకు గణేశ్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సింగిల్‌విండో విధానంలో మాత్రమే అనుమతులు పొందాలన్నారు. ప్రైవేటు స్థలంలో మంటపం ఏర్పాటు చేస్తే స్థల యజమాని రాతపూర్వక అనుమతి తప్పనిసరి అన్నారు. పర్యావరణ కాలుష్యానికి గురికాకుండా మట్టి గణపతి విగ్రహాలు మాత్రమే ఉపయోగించాలన్నరు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నిషేధమన్నారు. విగ్రహ నిమజ్జనానికి ప్రభుత్వం గుర్తించిన ఘాట్‌లను మాత్రమే ఉపయోగించాలన్నారు. ప్రతి మంటపం వద్ద సీసీ కెమెరాలు, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ ఉండాలన్నారు. అత్యవసరమైతే పోలీసు, అగ్నిమాపక సిబ్బందిని సంప్రదించాలన్నారు. మంటపాల్లో 5-10 మంది వరకు వలంటీర్లు ఉండాలన్నారు. ఎలాంటి ఘర్షణలు, గొడవలకు తావు ఉండకూడదన్నారు. నిరంతరం శబ్దం కాలుష్యం కలిగించే మైకులు, డీజేలు, డ్రమ్స్ వాడకూడదన్నారు. బాణ సంచా కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. రోడ్లను ఆక్రమించి వాహన రాకపోకలకు అంతరాయం కలిగించరాదని సూచించారు. ఈ మేరకు ఎస్పీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నకిలీలకు చెక్..!

● డీకేటీ పట్టాలపై డిజిటల్ క్యూఆర్ కోడ్
● నకిలీ పట్టాలపై ఉక్కుపాదం మోపిన రెవెన్యూశాఖ
● బద్వేలు డివిజన్‌లో ప్రయోగాత్మకంగా అమలు



ఇటీవల ఓ వృద్ధురాలికి డిజిటల్ క్యూఆర్ కోడ్ ముద్రించిన డీకేటీ పట్టాను అందించిన ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణం 2008లో మున్సిపాలిటీగా ఏర్పడింది. గ్రామీణ ప్రాంత ప్రజలు పిల్లల చదువు కోసం వ్యాపారాలు, ఉపాధి కోసం బద్వేలుకు వచ్చి నివాసం ఉండడం మొదలు పెట్టారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిస్థలాలకు డిమాండ్ పెరిగింది. రూ.10వేలు కూడా చేయని స్థలం రూ.10లక్ష ల విలువ వరకు పెరిగింది. దీంతో తొలినాళ్ల లో భూ ఆక్రమణలు మొదలయ్యాయి. భూ ఆక్రమణలు కష్టతరమనిపించి కబ్జాదారులు నకలీ పట్టాలకు తెరలేపారు. రెవెన్యూ శాఖలో దిగువ తరగతి అధికారుల సహకారంతో నకిలీ పట్టాలు తయారు చేస్తూ ధనార్జన చేయడమేకాక ఎంతో మంది అసలైన లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతూ వచ్చారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకే ప్రస్తుత బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ ఇంటి పట్టాపై డిజిటల్ స్కానర్ కోడ్ ముద్రించి భవిష్యత్తులో నకిలీ పట్టా సృష్టించకుండా చెక్ పెట్టారు.

జిల్లాలో ఎక్కడా లేని విధంగా బద్వేలు, గోపవరం మండలాల పరిధిలో భూ సమస్యలు ఎక్కువయ్యాయి. వాటికి ప్రధాన కారణం నకిలీ పట్టాలేనంటూ గతంలో ఆర్డీవోగా పనిచేసిన ఆకుల వెంకటరమణ గుర్తించారు. ఈ మేరకు నకిలీ పట్టాలు సృష్టించే వారిని అరెస్టు చేయించి కేసులు నమోదు చేయించారు. అయినప్పటికీ భూసమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో ప్రస్తుత ఆర్డీవో డిజిటల్ క్యూఆర్ కోడ్‌ను డీకేటీ పట్టాపై ముద్రించి కొత్తపద్ధతి ప్రవేశపెట్టారు.

డిజిటల్ క్యూఆర్ కోడ్‌తో..

ఇంటి పట్టాపై డిజిటల్ క్యూఆర్ కోడ్ ముద్రించడం వల్ల రెవెన్యూ కార్యాలయంలో స్కాన్ చేసిన వెంటనే జిల్లా పేరు, మండలం, సర్వేనెంబరు, లబ్ధిదారుని పేరు కంప్యూటరులో డిస్‌ప్లే అవుతాయి. తద్వారా రికార్డులు తిరగేయాల్సిన అవసరం లేదు.



అధికారులు శ్రమపడాల్సిన పనిలేదు. క్యూ ఆర్ కోడ్‌లోనే డీకేటీ పట్టా లబ్ధిదారుల వివరాలన్నీ నమోదవుతాయి. తద్వారా లబ్ధిదారులు కాకుండా వేరే వారు ఆ పట్టాలోని వివరాలు మార్చే అవకాశం ఉండదు. డీకేటీ ఇంటిపట్టాలపై డిజిటల్ క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు నిక్షిప్తం చేయడం బద్వేలు రెవెన్యూ డివిజనులో మొదటిసారిగా ప్రారంభించారు. దీంతో ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ పట్టాలకు చెక్

బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని బద్వేలు, గోపవరం మండలాల్లో నకిలీ పట్టాలతో అసలైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నకలీ పట్టాలు తయారు చేసే ముఠాను ఇటీవలే పోలీసు వారి సహకారంతో అరెస్టు చేసి జైలుకు పంపాం. అసలైన లబ్ధిదారునికి మేలు జరిగేందుకు నకిలీ పట్టాలకు చెక్ పెట్టేందుకు డీకేటీ పట్టాపై డిజటల్ క్యూఆర్ కోడ్ ముద్రించే వినూత్న పద్ధతిని అమలులోకి తెచ్చాం. తద్వారా నకిలీ పట్టాలు సృష్టించేందుకు వీలు లేకుండా పోయింది. అసలైన లబ్ధిదారుడి వివరాలు ఎన్ని సంవత్సరాలైనా రెవెన్యూ రికార్డుల్లో నిక్షిప్తమై ఉంటాయి.

- చంద్రమోహన్, రెవెన్యూ డివిజనల్ అధికారి, బద్వేలు

విద్యుత్ భద్రత నిబంధనలు పాటించాలి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. చిన్నపాటి తప్పిదం పెనువిషాదానికి దారితీస్తుందని హెచ్చరించారు. గురువారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక పందిళ్లను విద్యుత్ లైన్లకు సమీపంలో వేయకూడదని దీని వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. పందిళ్లను లైన్లకు దూరంగా ఏర్పాటుచేసుకుని విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారీ విగ్రహాలు ఊరేగింపు చేసేటపుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని అవసరమైతే విద్యుత్ సిబ్బంది సహకారం తీసుకొని విద్యుత్ ఆఫ్ చేయించుకొని ముందుకు సాగాలన్నారు.

సోలార్ ప్రాజెక్టుకు ఆమోదం

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం వద్దిరాల, దొడియం గ్రామాల్లో 1200.05ఎకరాల ప్రభుత్వ భూమిని అదానీ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు కోసం 33 సంవత్సరాల అద్దె ప్రాతిపదికన కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ముందస్తుగా స్వాధీనం చేసుకున్న భూములకు లీజుకు సంబంధించి దొడియం గ్రామంలో భూములకు రూ.3లక్షలు (మార్కెట్ విలువలో 10శాతం), వద్దిరాల గ్రామానికి రూ.6.25లక్షలు 33 సంవత్సరాల కాలానికి కేటాయిస్తూ.. 5 సంవత్సరాల బ్లాక్ యొక్క లీజు అద్దెపై పదిశాతం పెంచారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

● ముగ్గురు ఎంబీఏ విద్యార్థులు మృతి
● బాలరాజుపల్లె చెయ్యేరు వద్ద విషాదం
● ప్రాణాలతో బయటపడ్డ మరో ఐదుగురు విద్యార్థులు
● విద్యార్థుల కుటుంబీకుల్లో విషాదఛాయలు



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు, సహచర విద్యార్థులు



కేశవ, చంద్రశేఖర్ రెడ్డి, దిలీప్ మణి కుమార్ (ఫైల్)

రాజంపేట/రాజంపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులంతా కలిసి సరదాగా ఈత కొట్టేందుకు బాలరాజుపల్లె వద్ద చెయ్యేరు నదికి వెళ్లారు. ఈ సరదా కాస్తా విషాదంగా మారింది. నదిలోని నీటి గుంతల్లో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో చెందిన ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు ఎంబీఏ విద్యార్థులు రాజంపేట మండలం గాలివారిపల్లె గ్రామానికి చెందిన సోంబత్తిన దిలీప్‌కుమార్, కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కోనరాజుపల్లెకు చెందిన కొత్తూరు చంద్రశేఖర్‌రెడ్డి (22), కడప జిల్లా పోరుమామిళ్లకు గ్రామానికి చెందిన కేశవ అక్కడిక్కడే మృతి చెందగా మరో ఐదుగురు ప్రాణాలతో బయటపడ్డారు. రాజంపేట మండలం మన్నూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రాజు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన ద్వితీయ సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు ఉదయం మాత్రమే క్లాసులు ఉంటాయి. గురువారం మధ్యాహ్నం 8 మంది కలిసి రాజంపేట-రాయచోటి ఘాట్ రోడ్డులోని బాలరాజుపల్లె వద్ద చెయ్యేరు నది వద్దకు ఈతకు వెళ్లారు. ఎగువ ప్రాంతాల్లో వారం రోజులుగా వర్షాలు కురవడం, పింఛా ప్రాజెక్టు గేట్లు ఎత్తడం వల్ల నాలుగు రోజుల కిందట వరద నీరు చెయ్యేరుకు చేరింది. అందరూ భోజనాలు చేసి సరదాగా నదిలోకి దిగారు. బాలరాజుపల్లె వద్ద ప్రభుత్వం ఇసుక రీచ్‌ను మంజూరు చేసింది. ఆ ఇసుక రీచ్ కోసం వాహనాలు వెళ్లేందుకు మట్టిరోడ్డును వేశారు. దీనివల్ల అక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అందులోను వరదనీరంతా ఇసుక గోతులు ఉన్న వైపే అధిక స్పీడుతో నీరు పోతోంది. ఈ విషయాన్ని గమనించక విద్యార్థులు నదిలోకి దిగారు. వీరిలో సోంబత్తిని దిలీప్ కుమార్, కొత్తూరు చంద్రశేఖర్‌రెడ్డి, పీనరోతు కేశవ ఇసుక గుంతల్లో చిక్కుకుని అక్కడిక్కడే మృతి చెందారు. వారితో పాటు వెళ్లిన మరో ఐదుగురు విద్యార్థులు వెంటనే విషయాన్ని గమనించి బయటకు వచ్చేశారు. ఈ సమయంలో మహేంద్ర అనే విద్యార్థి కొట్టుకుపోతుండగా సహచర అనిల్ అనే విద్యార్థి అతడిని రక్షించాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వారిలో నంద్యాలకు చెందిన లోకేశ్వర్‌రెడ్డి, రాజంపేటకు మండలం ములక్కాయ లపల్లెకు చెందిన బాలదిలీప్, బి.కోడూరుకు చెందిన బుగ్గినేని మహేంద్ర, రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన సూరేపల్లె ఆనంద్‌లు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మిగిలిన విద్యార్థులు 100కు ఫోన్ చేయగా మన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను ఓ ఈతగాడి సహాయంతో బయటకు తీశారు. మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని గురువారం సాయంత్రం మృతుల తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించడంతో వారు కన్నీరు మున్నీరయ్యారు. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొంది స్థిరపడతారని తమ ఆశలు నెరవేరతాయానుకున్న తల్లిదండ్రులకు వారి ఈత సరదా వారి ఆశయలను అడియాశలు చేసింది. దీంతో సహచర విద్యార్థుల్లో తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది.

హౌసింగ్‌లో అవినీతి చేప

● పేదల సిమెంటును మార్కెట్‌లో అమ్ముకున్న ఘనుడు
● హౌసింగ్ ఎండీకి ఫిర్యాదు చేసిన సిమెంటు డీలర్స్
● విచారణ చేపట్టిన హౌసింగ్ విజిలెన్సు అధికారి



ప్రొద్దుటూరు , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌసింగ్ డివిజన్ కార్యాలయ పరిధిలో అవినీతి పెచ్చరిల్లిపోతోంది. గతంలో ఈ డివిజన్‌లోనే జగనన్న లేఅవుట్‌లలో ఇసుకను అమ్ముకుని కోట్లు గడించారు. ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో అప్పటి జిల్లా హౌసింగ్ అధికారులు విచారణ చేసి ఇసుక స్కాంలో కీలక పాత్ర ఉన్న ఒక ఏఈని సస్పెండ్ చేసి ముగ్గురు వర్కు ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. మరో ఏఈ పాత్ర ఉన్నా అతను అప్పటి జిల్లా హౌసింగ్ అధికా రులను అన్ని విధాల మేనేజ్ చేసుకుని ఆ కేసులో నుంచి బయట పడ్డాడని హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లోనే ప్రచారం సాగుతోంది. అదే అధికారి తనకు విద్యార్హత లేకున్నా జిల్లా హౌసింగ్ అధికారులను మేనేజ్ చేసి ఇన్‌చార్జ్ డీఈగా కూడా పదోన్నతి పొందాడు. తాజాగా ప్రొద్దుటూరు హౌసింగ్ గొడౌన్‌లో ఉన్న పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఇవ్వాల్సిన సిమెంటును బహిరంగ మార్కెట్‌లో లోడ్లు లోడ్లు విక్రయాలు జరిపాడని హౌసింగ్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రొద్దుటూరు హౌసింగ్ గోడౌన్ నుంచి సదరు అధికారి ఏకంగా పేదల సిమెంటును లోడ్లు లోడ్లు డీలర్ ఇచ్చే రేటు కంటే తక్కువగా విక్రయించాడు. మార్కెట్ రేటుకంటే తక్కువగా అమ్మడంతో ఈ విషయం స్థానిక డీలర్లకు తెలిసింది. ఈ సిమెంటు ఎక్కడి నుంచి వచ్చిందని వారు ఆరా తీశారు. దీంతో వారు కచ్చితమైన సమాచారంతో ఎక్కడ ఎవ్వరికి ఈ హౌసింగ్ అధికారి విక్రయించింది గుర్తించి నేరుగా హౌసింగ్ ఎండీకి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. దీంతో విజయవాడ హౌసింగ్ హెడ్ ఆఫీసు నుంచి హౌసింగ్ విజిలెన్సు అధికారి డీఈఈ చంద్రశేఖర రాజు గురువారం ప్రొద్దుటూరుకు వచ్చారు. ఆయన రెండుచోట్ల గోడౌన్లలో స్టాకు చెక్ చేశారు. అందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇన్‌చార్జ్‌గా ఉన్న గోడౌన్‌ను చెక్ చేయడానికి రాగా సదరు వ్యక్తి ఆ అధికారితో సైతం వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. దీంతో తాను ఎండీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టడానికి వచ్చానని తెలిపి గోడౌన్ స్టాకును పరిశీలించారు. దీంతో తన బాగోతం బయటకు పొక్క కుండా ఉండేందుకు విజిలెన్సు అధికారిని కూడా మేనేజ్ చేసేందుకు ఇన్‌చార్జి డీఈ యత్నించినట్లు సమాచారం.

ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నాం

పేదల సిమెంటును బహిరంగ మార్కెట్‌లో విక్రయించారంటూ సిమెంటు డీలర్స్ ఎండీ కి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నాం. ఆన్‌లైన్ స్టాక్‌కు గోడౌన్ స్టాక్‌కు ఉన్న తేడాను పరిశీలించాం. అలాగే లారీ లోడు సిమెంటు జేఎస్‌ఆర్ కంపెనీకి ఇచ్చినట్లు ఇన్‌చార్జి డీఈ చెబుతున్నారు. వాటి రికార్డులు కూడా పరిశీలించాం. కానీ కొన్ని సీఆర్‌వోలలో సరైన సంతకాలు లేవు. విచారణ నివేదికను హౌసింగ్ ఎండీకి నివేదిస్తాం.

- చంద్రశేఖర్ రాజు, హౌసింగ్ విజిలెన్సు అధికారి, విజయవాడ

అభివృద్ధి పనులు పెండింగ్ ఉండరాదు : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్ తదితరులు

కడప కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పెండింగ్ లేకుండా పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాజధాని అమరాతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో గ్రౌండ్ వాటర్, సానుకూల ప్రజాదృక్పథం, స్వమిత్ర కార్యక్రమం, స్వచ్ఛాంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువైనల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు అమలు, దిగువ కోర్టులలో ఉన్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ, రీసర్వే, ఇసుక సరఫరా తదితర అంశాలపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితి సింగ్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రభుత్వ సేవలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై వీక్లీ మీటింగ్స్ నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో విరివిగా వర్షాలు కురుస్తున్నందున పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్ఠం చేయాలన్నారు. తడి, పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూగర్భ జలవనరులను సంరక్షించుకునే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనర్ మనోజ్‌రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ఆత్మహత్య

● మృతుడిది శ్రీకాకుళం జిల్లా



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి జి.నరసింహనాయుడు

వేంపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం జరిగిన ఈ విషాదకర సంఘటనకు సంబంధించి ట్రిపుల్‌ఐటీ అధికారులు, విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

శ్రీకాకుళం జిల్లా యచ్చర్ల మండలం షేర్‌మహమ్మద్‌పుర గ్రామానికి చెందిన జి.అప్పలనాయుడు, జి.రాజులమ్మ దంపతుల కుమారుడు గురుగుబెల్లి నరసింహనాయుడు (18)కు గత ఏడాది ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చింది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. పీయూసీ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించాడు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజులుగా ముభావంగా ఉన్నట్లు సహచర విద్యార్థులు చెబుతున్నారు. ట్రిపుల్‌ఐటీలో చదువుకోవడం ఇష్టం లేదని, బైపీసీ చేసి తల్లిలాగా నర్సింగ్ కోర్సు చదవాలని ఉంది అంటూ అప్పుడప్పుడు విద్యా ర్థులతో చెప్పేవాడని అంటు న్నారు. భవనంపై నుంచి దూకితే మనిషి చనిపోతాడా అని కొద్ది రోజుల కిందట మాటల సందర్భంలో స్నేహితులతో అన్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున నిద్రలేచి బాత్‌రూ ములోకెళ్లి బట్టలు ఆరేసుకునే తాడుతో కిటికీ ద్వారా ఉరేసుకున్నాడు. 7.30 గంటల ప్రాంతంలో నరసింహనాయుడు ఉరివేసుకున్నట్లు గుర్తించారు. కాగా అప్పటికే విద్యార్థి మృతిచెందాడు. మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా వేంపల్లె వైద్యశాలకు తరలించారు. డైరెక్టర్ కుమార స్వామి గుప్త, పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ ఇతర అధికారులు మృతదేహాన్ని పరిశీలించారు. తల్లి రాజులమ్మకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కేవ్యాలీ ఏఎస్ఐ నాగరాజ తెలిపారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా.. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రిపుల్‌ఐటీ అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు.

చెత్త సేకరణ వంద శాతం జరగాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవి

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వందశాతం అమలు చేయడానికి రోడ్ మ్యాప్ రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ రవి తెలిపారు. గురువారం రాయచోటిలో జరిగిన మున్సిపల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రతి 15 రోజులకు ఒకసారి మురుగు కాలువలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టాలని శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మురుగునీరు నిలిచే ప్రదేశాలను శుభ్రం చేయాలని తెలిపారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణంలో అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులతో భోజనం వడ్డింపు



ఎస్పీవీడీ సభా హైస్కూల్లో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

సిద్దవటం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అమలుకు వంట ఏజెన్సీలను నియమించింది. సమకూర్చారు. మండలంలోని ఉప్పరపల్లె ప్రభుత్వ, ఎయిడెడ్, ఎస్పీవీడీ హైస్కూల్లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులే తోటి విద్యార్థులకు వంట మనుషులుగా భోజనం వడ్డించారు. నలుగురు విద్యార్థులు తోటి విద్యార్థులకు భోజనం వడ్డిస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్లో 172 మంది విద్యార్థులు ఉండగా 150 మంది హాజరయ్యారు. ప్రతిరోజూ ఇదేవిధంగా విద్యార్థులు భోజనం వడ్డిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కడప జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌ను వివరణ కోరగా విద్యార్థుల చేత భోజనం వడ్డించకూడదని, వంట ఏజెన్సీ యాజమాన్యంకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

రెండు పాడి ఆవులు మృతి

కలుషిత ఆహారమే కారణమన్న పశు వైద్యాధికారి



మృతి చెందిన రెండు పాడి ఆవులు

తంబళ్లపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు పాడి ఆవులు అకస్మాత్తుగా మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక వెంకటేశ్వరవీధికి చెందిన రైతు సుధాకర్ తన మూడు ఆవులను రోజు లాగానే బుధవారం ఇంటి పక్కనే ఉన్న చేన్లో మేతకు తోలుకెళ్లి సాయంత్రం ఆవులను తిరిగి షెడ్డులో తోలి పాలు పితికి మేత వేసి వెళ్లాడు. రాత్రి 9 గంటలకు మేత వేయడానికి వెళ్లగా ఒక ఆవు గిలగిలా కొట్టుకుంటూ కింద పడిపోయింది. ఈ విషయాన్ని స్థానిక పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే వచ్చి ఆవును పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు మరో ఆవు కూడా అదే విధంగా చనిపోయిందని రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. మరో ఆవు కూడా నీరసంగా ఉండడంతో వెంటనే పశు వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించడంతో కోలుకుంటున్నట్లు తెలిపాడు. చనిపోయిన రెండు ఆవుల విలువ సుమారు రూ1.50 లక్షల వరకు ఉంటుందన్నాడు. కలుషిత ఆహారం తినడంతోనే ఆవులు మృతి చెందాయని మండల పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి ధ్రువీకరించారు. పశువులకు వేసిన దాణా నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పశువైద్యాధికారి తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం సౌజన్యంతో ఏపీఎస్ఆర్టీసీ ద్వారా భారీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం అన్నమయ్య జిల్లా కార్యనిర్వహణాధికారి బి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. దీనికి అర్హత కలిగిన వారు షెడ్యూల్ కులాలకు సంబంధించిన వారై ఉండాలి. వారికి 21 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. మెడికల్ సర్టిఫికెట్‌తో పాటు లైసెన్స్ సర్టిఫికెట్, హెవీ మోటార్ లైసెన్స్ కొరకు 210 రూపాయలు ఎల్‌ఎల్‌ఆర్ కొరకు 1060 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఇందులో మొత్తం 10 మందిని ఎంపిక చేస్తారని అందులో 5 మంది మహిళలు, మిగిలిన 5 మందిని పురుషులను తీసుకుంటారని వారు తెలిపారు. మరిన్ని వివరాల కొరకు 9059100840 నెంబరు సంప్రదించాలన్నారు.

నీతి అయోగ్‌లో కురబలకోటకు బంగారు పతకం



జేసీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న ఎంపీడీవో, సిబ్బంది

కురబలకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలానికి నీతి అయోగ్‌లో బంగారు పతకం దక్కినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయిలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా నీతి అయోగ్ ద్వారా సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రభుత్వం నిర్దేశించిన 6 డెవలప్‌మెంట్ ఇండికేటర్స్‌లో 6 మార్కులకు గాను 6 మార్కులు సాధించి కురబలకోట ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో ఎంపీడీవో గంగయ్యకు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

యూరియా.. లేదయా...!



- యూరియా అమ్మలేమంటూ డీలర్ల ఆందోళన
- అవసరానికి మించి వాడుతున్న రైతులు
- డీబీటీ నివేదికల్లో తప్పుల కుప్పలు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవక అల్లాడిన రైతులు, ప్రస్తుతం విస్తారంగా వర్షాలు పడటంతో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. యూరియా కొరత వుందని తెలుసుకుని ఇంట్లో వున్న సభ్యులందరి ఆధార్‌కార్డులు పట్టుకుని ఎరువుల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. కొంతమంది ముందస్తుగానే యూరియా అధికంగా కొనుగోలు చేసి నిల్వలు ఉంచుకుంటున్నారు. ఎరువుల డీలర్లు యూరియా విక్రయాలంటేనే హడలెత్తుతున్నారు. యూరియా తమ వద్ద లేదంటూ దుకాణాల ఎదుట నోటీసు బోర్డులు పెడుతున్నారు.

మదనపల్లె టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా రైతులు వరి సాగుపై దృష్టి పెట్టారు. దీనికి అనుగుణంగా ముందస్తుగా ఎరువులు (యూరియా) సేకరించి నిల్వ చేసుకుంటున్నారు. వచ్చే రబీ సీజన్‌లో 25 వేల హెక్టార్లలో వరి, జొన్నకర్రలు (ఆవులకు మేత)తో పాటు వివిధ రకాల పంటలు సాగు కానున్నాయి. పైరు ఏపుగా పెరిగేందుకు రైతులు యూరియాపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు నెలలకు ప్రభుత్వం కేటాయించిన యూరియా చూసుకుంటే జూన్‌లో ప్రైవేటు దుకాణాలకు 197.2 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే)లకు 665.04 మెట్రిక్ టన్నులు, జూలై నెలలో ప్రైవేటు దుకాణాలకు 576, ఆర్ఎస్‌కేలకు 1114, ఆగస్టు నెలకు ప్రైవేటు దుకాణాలకు 435, ఆర్ఎస్‌కేలకు 850 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం ఇప్పటి వరకు 3,837 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. ఈ యూరియా స్టాకు వచ్చిన రెండు రోజుల్లో పూర్తిగా అమ్మకాలు అయిపోతున్నాయి ఇది పోనూ ఆగస్టు నెల కోటా కింద 5064 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రైతులు వారి భూముల వన్-బి, ఆధార్‌కార్డులు తీసుకొచ్చి ప్రైవేటు దుకాణాలు, ఆర్ఎస్‌కేల వద్ద పడిగాపులు కాచి మరీ యూరియా తీసుకెళ్లిపోతున్నారు. దీంతో జిల్లాలోని పలు ఎరువుల దుకాణల వద్ద యూరియా లేదంటూ బోర్డులు పెట్టేస్తున్నారు.



రామసముద్రంలో యూరియా కోసం దుకాణం ఎదుట బారులు తీరిన రైతులు (ఫైల్)

అవసరానికి మించి వాడుతున్న రైతులు

సాధారణంగా వరి సాగులో ఒకటిన్నర ఎకరా విస్తీర్ణానికి మూడు విడతలుగా కేవలం 80 కిలోల యూరియా మాత్రమే వినియోగించాల్సి ఉంది. కానీ వాస్తవంగా రైతులు చూస్తే ఒకటిన్నర ఎకరా వరి మడికి 245 కిలోల యూరియా వాడుతున్నారు. శాస్త్రీయంగా చూస్తే యూరియా వాడకం వలన పైరు ఏపుగా పెరగదని కేవలం సస్యరక్షణ కోసమే మాత్రమే యూరియా ఉపయోగపడుతుందని కేవీకే శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కానీ రైతులు ఈ సూచనలు, సలహాలు పెడచెవిన పెడుతూ అవసరానికి మించి యూరియాను వాడుతున్నారు.

యూరియా అంటేనే డీలర్ల హడల్

యూరియానా మేమమ్మలేము స్వామి..అంటూ ఎరువుల డీలర్లు ముఖాలు చాటేస్తున్నారు. వాస్తవంగా యూరియా 45 కిలోల బస్తాను రూ.265కు విక్రయించాలి. యూరియా తయారు చేసే కంపెనీలు స్పిక్, జైకిసాన్, మంగళ, ఆర్‌సీఎఫ్, నాగార్జున కంపెనీల నుంచి రైలు మార్గంలో కడప, రేణిగుంట, చిత్తూరు స్టాక్ పాయింట్లకు యూరియా సరఫరా చేస్తాయి. అక్కడ నుంచి జిల్లా వ్యాప్తంగా యూరియా రవాణా చేయాలంటే బస్తాకు రూ.56 ఖర్చు వస్తోంది. అంతేకాకుండా గత ఏడాది యూరియా తయారు చేసే కంపెనీలు ఒక బస్తా యూరియాకు, మరో బస్తా వేప పిండి కొనుగోలు చేయాలని డీలర్లకు కండీషన్లు పెట్టాయి. దీంతో డీలర్లు ఈ కండీషన్‌ను అనుసరించి యూరియాతో పాటు వేప పిండి కూడా కొనుగోలు చేశారు. కానీ డీలర్ల నుంచి రైతులు కేవలం యూరియాను మాత్రమే కొనుగోలు చేశారు, వేప పిండి వద్దంటూ వెళ్లిపోయారు. దీంతో ఒక్కో డీలర్ వద్ద ఇప్పటికి వేపపిండి స్టాకు సేల్స్ లేక అలాగే నిలిచిపోయాయి. ఇకపోతే యూరియా బస్తా రూ.267 ఎమ్మార్పీకి విక్రయించాలి. కానీ ఖర్చులు అధికం కావడం రవాణా, కూలీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు యూరియా విక్రయాలకు మొగ్గు చూపడం లేదు. కేవలం రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను వీఏఏలు విక్రయిస్తున్నారు. అది కూడా రైతులు ఆధార్ కార్డులు, వన్-బి జిరాక్స్‌లు చూపితేనే విక్రయిస్తున్నా..స్టాకు వచ్చిన రోజు సాయంత్రమే ఆర్ఎస్‌కేలు ఖాళీ అయిపోతున్నాయి.

స్టాకు విడుదల చేయని కంపెనీలు

జిల్లాలోని 500 రైతు సేవా కేంద్రాలకు వ్యవసాయ శాఖ యూరియాను మంజూరు చేసి వీఏఏల ద్వారా విక్రయిస్తోంది. ఇలా పంపిన స్టాకు విక్రయించిన వీఏఏలు డైరెక్ట్ బెనిఫిసరి ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) నివేదికలను పూర్తి చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపాలి. కానీ ఇటీవల జిల్లా వ్యాప్తంగా వీఏఏలు బదిలీలు కావడంతో, ఆర్ఎస్‌కేలకు బదిలీపై వచ్చిన వీఏఏలు డీబీటీ నివేదికలు పూర్తి చేయడంలో తప్పులు వచ్చినా, సరిదిద్దకుండా అలాగే ఉన్నతాధికారులకు పంపించేశారు. ఉదాహరణకు మదనపల్లె మండలంలో గత నెల 180 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు కాగా అన్ని ఆర్ఎస్‌కేలలో విక్రయించేశారు. కానీ డీబీటీ నివేదికల్లో కేవలం 20 టన్నులు మాత్రమే విక్రయించినట్లు నివేదికలు చూపిస్తున్నాయి.

అంటే ఇంకా మదనపల్లె మండలంలోని ఆర్ఎస్‌కేలల్లో 120 టన్నులు నిల్వ ఉన్నట్లు డీబీటీ నివేదికల్లో చూపిస్తుండటంతో రెండో దఫా యూరియా స్టాకు విడుదల కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అంతేకాకుండా వన్-బిలు లేని రైతుల వేలిముద్రలు పడకపోవడంతో కూడా సమస్య వస్తోందని తెలుస్తోంది. ఈ సమస్యలన్నింటిపై గత సోమవారం విజయవాడ నుంచి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డిల్లీరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వ్యవసాయశాఖ అధికారులకు తగిన సూచనలిచ్చారు. ఎక్కడ కూడా యూరియా కొరత వుండకూడదని హెచ్చరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 150 కుటుంబాలు చేరిక



మంత్రి మండిపల్లి సమక్షంలో టీడీపీలో చేరిన లక్కిరెడ్డిపల్లె వాసులు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు పోల్‌రెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం 150 కుటుంబాలు విజయవాడలోని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోల్‌రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ వైసీపీలో చేరి ఎంతో సేవ చేశామని, వారి గెలుపునకు ఎంతగానో సహకరించామన్నారు. అయితే గడికోట కుటుంబాల నుంచి ఎలాంటి మేలు జరగలేదని దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో టీడీపీలో చేరామని ఆయన తెలిపారు. అలాగే పందిళ్లపల్లె మాజీ ఎంపీటీసీ రాజేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, ముదిరాజ్ సంఘం బీసీ నాయకుడు ఎలంకూరి విజయ భాస్కర్, బడుగు వాసుదేవుడు షేరాసాహెబ్, రవి, ఆచారి, చాగలగుట్టపల్లి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వెంకట్రమణ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లె అర్బన్,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు కదిరి రైల్వే జీఆర్‌పీ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే షైమూల్ కుమారుడు షేక్ ఖాదిర్ (30) మదనపల్లె మండలం, సీటీఎం రైల్వేస్టేషన్ సమీప బ్రిడ్జి వద్ద హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడు ఐదేళ్ల కిందట కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి వచ్చి అక్కడ ఇంటి నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి మదనపల్లెలో అమ్ముతుండేవాడు. నెల క్రితం ఆసిఫ్ అనే వ్యక్తి తనకు 2 కేజీలు గంజాయి కావాలని ఖాదిర్‌కు రూ.50 వేలు ఇచ్చాడు. అతడికి గంజాయి ఇవ్వలేదు. డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో ఆసిఫ్ తన మిత్రులైన మౌలా, సుల్తాన్ చెప్పగా ముగ్గురూ కలిసి ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అంగళ్లులో ఉన్న ఖదీర్ వద్దకు వెళ్లి అతడిని కారులో కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద నీలగిరి తోటలో ఖదీర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారు. అక్కడి నుంచి మదనపల్లెకు ఆసిఫ్ ఇంటికి తీసుకొచ్చి అక్కడ కూడా చిత్రహింసలు పెట్టారు. దీంతో దెబ్బలు తాళలేక అక్కడే చనిపోయాడు. దీంతో శవాన్ని సీటీఎం సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద పడేసి వెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నిందితులను గుర్తించారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జాకిర్‌ఖాన్ కుమారుడు ఆటోడ్రైవర్ పఠాన్ ఆసిఫ్‌ఖాన్ (40), మదనపల్లె పట్టణం, దేవళంవీధికి చెందిన షేక్ ఖాదర్‌వలి కుమారుడు షేక్‌మౌలా (33)ను కదిరి పోలీసుల నిందితులను గుర్తించారు. శవాన్ని పడేసేటప్పుడు ఎవరో చూశారని భయపడిన ఇద్దరు ఈనెల 20వ తేదీ కదిరి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. మరో నిందితుడు సుల్తాన్ పరారీలో ఉన్నాడు. ఇతడు 2016లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు, ఇతనిపై రౌడీషీట్ కూడా ఉంది. కేసు దర్యాప్తులో ధర్మవరం ప్రభుత్వ రైల్వే సీఐ అశోక్‌కుమార్, కదిరి ప్రభుత్వ రైల్వే ఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌బాషా, ఉన్నారు.

నెలన్నరగా 'బందీగా బుద్ధుడు'

- రేపు తిరుమావళవన్ రాక?



బుద్ధుడి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

మదనపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె బుద్ధునికొండలో బుద్ధుడి విగ్రహం తల నరికారని ఫిర్యాదు చేస్తే పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి అక్కడున్న విగ్రహానికి ఇనుప కంచె వేసి బుద్ధుడిని బంధించారు. నెలన్నర రోజులు దాటుతున్నా ఇనుప కంచె నుంచి బుద్ధుడికి విముక్తి కల్పించలేదు. దీనిపై నిరసన తెలిపిన బౌద్ధులపై కేసులు పెట్టారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై బాస్ నేత పీటీఎం శివప్రసాద్ గుండెపోటుకు గురై స్టంట్ కూడా వేయించుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, వీకేసీ పార్టీ అధినేత, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తిరుమావళవన్‌తో చర్చలు జరిపి ఇరువర్గాలు సమన్వయం పాటించి పరస్పర సహకారంతో బుద్ధుని కొండ వివాదాన్ని సున్నితంగా పరిష్కారం చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ శనివారం ఎంపీ తిరుమావళవన్ బుద్ధుని కొండను సందర్శించేందుకు, అక్కడ బౌద్ధ సమ్మేళనం నిర్వహించుకునేందుకు అనుమతి ఇస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. ఈ మేరకు బాస్ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత పోలీస్ అధికారుల సూచనల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీస్, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ నిర్వాహకులను తిప్పుకుంటున్నారు. సమావేశానికి ఒక్క రోజే వ్యవధి ఉండడంతో అనుమతి ఇస్తారో లేదో తెలియడం లేదు. ఇనుప కంచె నుంచి బుద్ధుడిని విడుదల చేస్తారో లేదో రేపటి వరకు వేచి చూడాల్సి ఉంది.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ఒంటిమిట్ట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేద్దామని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఈగల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయడం కోసం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిఒక్కరు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ సంబంధిత మాదక ద్రవ్యాల సమాచారాన్ని ఈగల్ టోల్‌ఫ్రీ నంబరుకు తెలపాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో మాదకద్రవ్యాల నివారణలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమనిరంజనమ్మ, ఈగల్‌క్లబ్ సభ్యులు అయుబ్‌ఖాన్, నార్కోటిక్ అధికారులు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీవీ నాగేంద్రకుమార్ అన్నారు. గురువారం ఆదర్శ పాఠశాల, కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల నమోదు శాతం, రికార్డులను పరిశీలించారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాఠశాలకు వచ్చే సమయం, బయటకు వెళ్లే సమయాన్ని పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు అర్థమయ్యేలా సరళరీతిలో బోధన అందించాలని తెలిపారు. విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జేఈఈ, నీట్, ఎన్ఎన్‌యంఎస్ తరగతుల నిర్వహణ గురించి సమీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు



చెరువులోకి ట్రాక్టర్‌లు వెళ్లకుండా గాడి తీస్తున్న దృశ్యం

గాలివీడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. గురువారం పెద్దచెరువులో మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం చెరువులోకి ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు వెళ్లకుండా మార్గాలను మూసివేస్తూ ట్రెంచ్ (గొయ్యి) తీయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గుట్టలు, వాగులు, వంకలు, చెరువుల్లో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అంతేగాక క్రిందిస్థాయి సిబ్బంది ప్రలోభాలకు పాల్పడి మట్టి వ్యాపారులకు సహకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.21.50 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

బి.కొత్తకోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో రూ.13.50 కోట్ల 15వ ఆర్థికసంఘం నిధులు, రూ.8 కోట్ల ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన నిధులతో మౌలిక వసతుల కల్పన, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన బి.కొత్తకోట మండలంలో పర్యటించారు. మరమ్మతు పనులు జరుగుతున్న జడ్పీ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, సిబ్బందితో ఆయన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సీఈవో మాట్లాడుతూ మండలంలో చెత్త సంపద కేంద్రాలన్నీ వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. రూ.18 లక్షలతో ఆరు గ్రామాలలో నిర్మించిన వాటర్‌ప్లాంట్ల స్థితిపై ఆరా తీశారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, మౌలికవసతుల కల్పనలో పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కేంద్ర, కార్యక్రమంలో ఎంపీడీవో క్రిష్ణవేణి, ఏవో ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అడల్ట్ కంటెంట్...



- ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్లీల దృశ్యాలు
- ఆకర్షితులవుతున్న యువత
- బానిసలుగా మారుతున్న వీక్షకులు
- పోలీసులకు తలనొప్పిగా మారిన సమస్య

కడప క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత టెక్నాలజీ యుగంలో స్మార్ట్‌ఫోను ఉంటే ప్రపంచమే అరచేతుల్లో కనిపిస్తుంది. సెల్‌ఫోన్ వినియోగించని వారున్నారంటే ఆశ్చర్యమే. ఇక సెల్ చేతిలో ఉంటే ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్‌ల వీక్షకుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది. ఈ నేపథ్యంలో కొంత మంది యువత, మధ్య వయస్కులు స్వయం తృప్తి కోసం ఆన్‌లైన్‌లో అడల్ట్ కంటెంట్ (అశ్లీల వీడియోలు) చూస్తుంటారు. ఈ మధ్యకాలంలో ఈ కంటెంట్ చూసే వీక్షకులు పెరిగిపోయారంటే అతిశయోక్తి కాదు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అడల్ట్ కంటెంట్ చూసేందుకు ఎగబడుతున్నారు. ఇక కొంత మంది యువత దీనికి అడక్ట్ అయిపోయారు. ఈ అశ్లీల వీడియోలు వారిపై ప్రతికూల ప్రభావాలు చూపుతన్నాయి. లైంగిక ఆలోచనలు, ప్రవర్తన, సంబంధాలపై ఈ ప్రభావం ఎక్కువగా కనబడుతోంది. వీరి వీక్‌నెసన్‌ను క్యాష్ చేసుకునేందుకు కొందరు సిగ్గు విడిచి బూత్ కంటెంట్, అశ్లీల దృశ్యాలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారు. యువకులను ఆకట్టుకునేలా రీల్స్ చేస్తున్నారు. టెంప్ట్ చేసే వీడియోలను ప్రైవేటులో ఉంచి మరింత కంటెంట్ కోసం సబ్‌స్క్రిప్షన్ అడుగుతున్నారు. ఇలాంటి వీడియోలను చూడాలంటే రూ.399 స్కానర్ ద్వారా వసూలు చేస్తున్నారు. ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో రూ.399 ఫీజు పెట్టగా.. ఆ ఫీజు చెల్లించి దాదాపు 8730 మంది సబ్ స్క్రయిబ్ చేసుకున్నారంటే ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

● కడపకు చెందిన ఓ వివాహిత ఇన్‌స్టాగ్రామ్‌లో తన అశ్లీల దృశ్యాలను ప్రైవేటులో ఉంచింది. దాని కంటెంట్ కోసం సబ్ స్క్రిప్షన్ అడగ్గా, ఎంతోమంది ఆ వీడియోల కోసం డబ్బులు చెల్లించి మరీ వీక్షించారు. గతంలో తన ప్రియుడుతో చేసిన వీడియో సైతం పోస్టు చేసినట్లు తెలుస్తుంది, చివరికి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెకు కౌన్సెలింగ్ చేసి పంపినట్లు సమాచారం.

● జిల్లాకు చెందిన మరో యువతి కూడా ఇలాగే వీడియో లను పోస్టులు చేసి యువత నుంచి డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇదో కొత్త వ్యాపారంగా మారుతోంది. ఇలాంటి వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పోలీసుల వద్దకు పోతే మన పరువు పోతుందన్న ఉద్దేశ్యంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువతను తల్లిదం డ్రులు సరైన దారిలో పెట్టలేక సతమతమవుతున్నారు. అడల్ట్ కంటెంట్‌తో వీడియోలు తీస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువతపై ప్రభావం

అడల్ట్ కంటెంట్ యువతలో లైంగిక ఆలోచనలను రేకెత్తిస్తుం ది. ఇది వాస్తవికతకు దూరంగా ఉండే భావాలను కలిగి ఉండడానికి దారి తీస్తుంది. ఇలాంటి అశ్లీల వీడియోల వైపు యువత, పిల్లలతో పాటు పెద్దలు కూడా మొగ్గు చూపుతుంటారు. దీంతో వాస్తవికత జీవితం ఇలాగే ఉండాలనే భావనకు వస్తూ కొంతమంది దంపతులు విడిపోయే పరిస్థితులు తలెత్తుతు న్నాయి. మరికొందరు ఇతరులపై మోజు పెంచుకుని చేయి దాటి వెళుతున్నారు. ఇలాంటి వాటిపై ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు చర్యలు తీసుకోలేని పరిస్థితి.

అప్రమత్తంగా ఉండాలి

13 నుంచి 20 సంవత్సరాల మధ్య యువతకు మంచి చెప్పినా బుర్రకు ఎక్కదు. ఇక మొబైల్ చేతిలో ఉంటే ఫేస్‌బుక్కు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో గడుపుతుంటారు. ఆ సమ యంలో పిల్లలు ఎలాంటి వీడియోలు చూస్తున్నారో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ గమనిస్తూ ఉండాలి. ఎక్కువగా యువత అశ్లీల దృశ్యాలకు ఆకర్షితులవుతున్నారు. దీంతో ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లోని అడల్ట్ కంటెంట్ వీడియోలకు ఎక్కువగా యువత బానిసగా మారుతోంది. ఈ నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలంటూ పోలీసులు చెప్పుకొస్తున్నారు.

డీసీఈబీ హాల్ నిర్మాణానికి సహకరించండి



సీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌టీయూ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పదివేల మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని కడప జిల్లా ఎస్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జడ్పీ కార్యాలయంలో సీఈఓ ఓబులమ్మను కలిసి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1997లో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ తులసిరెడ్డి నిర్మింపజేసిన డీసీఈబీ హాల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఉపాధ్యాయుల కౌన్సెలింగ్, విద్యారంగ సమస్యలపై సమావేశాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉండేదన్నారు. దీన్ని కూల్చివేయడంతో ప్రస్తుతం డీసీఈబీ హాల్ లేక ఉపాధ్యాయులు, విద్యాశాఖ మండల, జిల్లా అధికారులకు చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. కామన్ ఎగ్జామినేషన్ బోర్డు హాల్ నిర్మాణానికి సహకరించాలని ఎస్టీయూ ప్రతినిధులు కోరారు.

పెద్ద దర్గా అభివృద్ధికి సహకరించాలి



సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న పీఠాధిపతి అరిఫుల్లాహుస్సేని

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రసిద్ధి చెందిన అమీన్‌పీర్ దర్గా అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరీఫుల్లాహ్ హుస్సేని కోరారు. గురువారం సెక్రటేరియట్‌లో టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దాదర్గా అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేయగా.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ దర్గా అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీలకు భారీ మోటరు డ్రైవింగ్‌లో శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూలు కులాలకు చెందిన యువతకు భారీ మోటరు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడి డాక్టర్ రాజ్యలక్ష్మి ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 40సంవత్సరాల లోపు వారు మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లైట్ మోటరు వెహికల్ లైసెన్సు కలిగిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. హెవీ మోటరు వెహికల్ ఎల్ఎల్ఆర్ కోసం రూ.211, లైసెన్సు కోసం రూ.1060 అభ్యర్థి చెల్లించాలని అన్నారు. జిల్లాలో మొత్తం 10మంది అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని.. అందులో ఐదుగురు పురుషులు, ఐదు మంది మహిళలు ఉంటారన్నారు. దరఖాస్తులు పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితాను కలెక్టరు ఆమోదంతో ఎంపిక చేయనున్నట్లు వివరించారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజరు ఆధ్వర్యంలో భారీ మోటరు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను కలెక్టరు కార్యాలయంలోని ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసులో ఈనెల 27లోపు సమర్పించాలని వివరించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కడప రిమ్స్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో గల ప్రభుత్వ బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తల మహిళా శిక్షణ పాఠశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) ట్రైనింగ్ కోర్సులో చేరేందుకు ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులైన కడప, అన్నమయ్య, అనంతపురం జిల్లాల అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీ కోరారు. కోర్సు కాలవ్యవధి 2 సంవత్సరాలు ఉంటుందన్నారు. శిక్షణలో చేరు విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి, వైద్యంతో పాటు రూ.2వేల నుంచి రూ.2500 వరకు స్టయిఫండ్ ఇస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఏపీ పేరుతో తీసిన రూ.50 డీడీని జతచేయాలన్నారు. ఫీజు చెల్లింపునకు సెప్టెంబర్ 30 ఆఖరు తేదీ. ఎంపిక జాబితాను అక్టోబరు 15న ప్రకటిస్తారన్నారు. ఇతర వివరాలకు 944041165, 8790710182, 9491038846 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ (26) అనే యువకుడు విషద్రావణం తాగి మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన పవిత్ర అనే యువతిని వినోద్‌కుమార్ ప్రేమించాడు. వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించారు. దీంతో ఆగస్టు 15న పవిత్ర ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వినోద్‌కుమార్ బుధవారం రాత్రి విషద్రావణం తాగాడు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు అటు నుంచి కర్నూలుకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని తండ్రి గాబ్రియల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీనివాసులు (ఫైల్)

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న భాకరాపురం గ్రామానికి చెందిన సి.శ్రీనివాసులు (54) అనే రైతు గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. పొలం వద్ద మోటారు వదులుతుండగా షార్ట్‌సర్క్యూట్ కారణంగా షాక్‌కు గురై మృతి చెందాడన్నారు. మృతుని భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించినట్లు వివరించారు.

పొలం విషయమై దాడి

ముద్దనూరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో పొలం విషయమై గురువారం బోరెడ్డి శివనారాయణరెడ్డిపై అదే గ్రామానికి చెందిన భూమిరెడ్డి నాగిరెడ్డి మరి కొందరు దాడి చేసి గాయపరిచినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలిలా.. బోరెడ్డి శివనారాయణరెడ్డి, భూమిరెడ్డి నాగిరెడ్డిల మధ్య పొలం విషయంలో తగాదా ఉంది. ఈ తరుణంలో శివనారాయణరెడ్డి పొలంలో పనిచేసుకుంటుండగా భూమిరెడ్డి నాగిరెడ్డి, లక్ష్మిప్రసాదరెడ్డి, బాలనాగిరెడ్డి, మరికొందరు పొలం వద్దకు ట్రాక్టర్లలో వచ్చి అతనిపై గొడ్డలితో దాడి చేశారు. దీంతో శివనారాయణరెడ్డికి రెండు చేతులకు రక్తగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

సింహాద్రిపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామం సాయిబాబా ఆలయం ప్రాంగణంలో గల సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోని రాగి తీగ బుధవారం రాత్రి చోరీకి గురైంది. గమనించిన ఆలయ నిర్వాహకులు గురువారం విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మండల విద్యుత్ అధికారి దినేష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు దించి అక్కడే పగులగొట్టి కాపర్ వైర్‌ను దుండగులు దోచుకెళ్లారు. ఈమేరకు సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

పొలంలో విద్యుత్ వైర్లు...

మైదుకూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని బోర్ల వద్ద విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, వెంకటాపురం గ్రామాలలోని పొలాల వద్ద దొంగలు కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు దొంగలించినట్లు తెలిపారు. ఆరుగాలం శ్రమించినా పంటల పండక అవస్థలు పడుతుంటే దొంగల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో వాపోయారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలతో పాటు రుణాలు పొందిన వారు సద్వినియో గం చేసుకోవడంతో పాటు సకాలంలో తిరిగి రుణాలు చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఏపీయంలతో సంఘాల రుణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంఘానికి ఆర్థిక, అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని 26508 స్వయం సహాయక సంఘాలకు 10970 డిజిటల్ ఎంసీపీని ఆమోదించినట్లు తెలిపారు. మిగిలిన సంఘాలకు ఈనెలాఖరులోపు ఆమోదం వస్తుందన్నారు. రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు మరింతగా సహకరించాలని ఆమె కోరారు. రుణాల చెల్లింపులో రికవరీ మొత్తాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అలాకాకుండా ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజరు కిశోర్ మాట్లాడుతూ కడప డివిజనులో ఎస్‌బీఐ బ్రాంచ్‌లు ఈనెల నాలుగో శనివారం కూడా పనిచేస్తాయని.. సెర్ప్ సిబ్బంది బ్యాంకు అధికారులతో మాట్లాడి సంఘాలకు సంబంధించిన ఎంసీపీలు, సంఘాల రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం జనార్థన్, డీసీసీబ్యాంకు సీఈవో రాజామణి, వివిధ బ్యాంకుల ఆర్ఎంలు, డీఆర్‌డీఏ డీపీయంలు, జీవనోపాధుల డీపీయంలు, ఏపీఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రపంచానికి తెలుగు జాతి కీర్తిని చాటిన నేత ఎన్టీఆర్



ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణలో ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి తెలుగుజాతి కీర్తిని చాటిన మహానుభావుడు ఎన్టీఆర్ అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ కొనియాడారు. మైదుకూరులోని కడప రోడ్డులో నూతనంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయల్ కూడలి నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఫ్లడ్ లైట్లను ప్రారంభించి, ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో మొక్కలను నాటారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీంద్ర, టీడీపీ నాయకులు దాసరి బాబు, యాపరాల చిన్న, పాశం మారుతీ, మిల్లు శ్రీను, పుట్టా ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బంది నిరసన



కడప ఫారెస్టు డివిజను ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం వద్ద బుధవారం రాత్రి అక్కడ అటవీ సిబ్బందిపై స్థానిక ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దౌర్జన్యం చేసి దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు దిగిన సంఘటనపై వైఎస్ఆర్ కడప డివిజను అటవీశాఖ సిబ్బంది గురువారం ఫారెస్టు డివిజను ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అటవీ వనరులను కాపాడడానికి నిరంతరం కష్టపడుతున్న ఉద్యోగులపై ఇలాంటి దాడులు సరికాదన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సహచర ఉద్యోగులకు పూర్తి న్యాయం జరిగేంత వరకు నిరసన కార్యక్రమాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు 10 మంది ఎంపిక

కడప స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హర్యానాలోని కురుక్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరుగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు కడప జన్ షిటోర్ యు కరాటే విద్యార్థులు పది మంది ఎంపిక కావడం అభినందనీయం అని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. ఆ మేరకు ఎంపికైన విద్యార్థులను గురువారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆయన అభినందించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించుకునేందుకు కరాటే క్రీడను ఎంచుకుని ప్రతిభ చాటడం ప్రశంసనీయమన్నారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజయం సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కోచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఏజెన్సీపై కేసు నమోదు

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సీపీబ్రౌన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పని చేయకపోవడంతో డాక్టర్ రామచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏజెన్సీలపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సీపీ బ్రౌన్ లైబ్రరీలో 2018లో ఎస్‌ఏసీ ఇన్‌ఫ్రా భారత్ ఎంటర్‌ప్రైజస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో లిఫ్ట్ ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి లిఫ్ట్ పనిచేయకపోవడంతో పలుమార్లు వారు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. ఈ మేరకు సీపీబ్రౌన్ మెంబర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



ఇడమడక గ్రామంలో ప్రజలను విచారిస్తున్న ఆర్డీవో

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక గ్రామంలో రంగగాళ్ల బుజ్జి అనే రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై గురువారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ విచారణ చేశారు. ఏడీఏ క్రిష్ణమూర్తి, తహసీల్దారు సంజీవరెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్‌తో కలిసి రైతు ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. 2024 మే 6వ తేదీన అప్పుల బాధతో రైతు బుజ్జి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య నరసమ్మ, నలుగురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పట్లో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాలన్నింటిపై కుటుంబ సభ్యులు, అక్కడి ప్రజలతో అధికారులు ఆరా తీశారు. వీరు తెలిపిన విషయాలను విచారణ బృందం నమోదు చేసుకున్నారు.

చీపాడు పాఠశాలలో డీఈవో తనిఖీ



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు పాఠశాలను ఆయన పరిశీ లించారు. ఇటీవల ఆ పాఠశాలలోని విద్యార్థులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేయాలని ధర్నా నిర్వహించారు. ఇందుకు కలెక్టర్ స్పందించి ఆ పాఠశాల స్థితిగతులను తెలు సుకోవాలని ఆదేశించడంతో డీఈవో పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డీఈవోకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పవద్దని, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకాన్ని, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలని వారు వినతి పత్రంలో కోరారు.

సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు 23న హాజరు కావాలి

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు ఆగస్టు 23న తమ సర్టిఫికెట్లతో గుంటూరులో హాజరు కావాలని గుంటూ రు ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల నుంచి ఎస్‌సీటీ సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, స్త్రీ అభ్యర్థులు ఈనెల 23న గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉదయం 10గంటలకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు ఎంపిక ప్రక్రియలో అప్లికేషన్‌తో జతపరిచిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలను తీసుకురావాలని ఎస్పీ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని జలాశయ అధికారులు సోమవారం తెలిపారు. పెన్నానదికి దాదాపు 10 వేల క్యూసెక్కుల నీరు, అలాగే ఉత్తర, దక్షిణ కాలువలకు 190 క్యూసెక్కుల మేర నీటిని వదులుతున్నామన్నారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 10 వేల క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోందన్నారు. మైలవరం జలాశయం పూర్తి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.2 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కడపకు చెందిన ఓ నేత వద్ద ఆ కానిస్టేబుల్ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అతని వద్ద ఉన్న పిస్తోలు 9ఎంఎం పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై విచారించిన ఎస్పీ అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

మున్సిపల్ డీఈగా సురేష్‌బాబు

పులివెందులరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపల్ డీఈగా సి.సురేష్‌బాబు నియమితులయ్యారు. నంద్యాల పబ్లిక్ హెల్త్‌లో క్వాలిటీ కంట్రోల్ ఏఈగా పనిచేస్తూ పదోన్నతి పొంది పులివెందుల డీఈగా వచ్చారు. గతంలో పులివెందుల డీఈగా కడప కార్పొరేషన్ నుంచి వచ్చిన కిరణ్‌కుమార్ తిరిగి యథాస్థానానికి వెళ్లారు. ఈ సందర్భంగా డీఈ సురేష్‌బాబు మున్సిపల్ కమిషనర్ రాముడును కలిసి మొక్క అందించారు. అనంతరం డీఈగా బాధ్యతలు చేపట్టారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పులివెందుల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కె.వెలమవారిపల్లె గ్రామంలో వెలసిన రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. ముందుగా ఆలయంలో ఆలయ అర్చకులు కాశీభట్ల గోపీనాథ్‌శర్మ నేతృత్వంలో యజ్ఞాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కడప క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు సీటు బెల్టు, హెల్మెట్లు ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ నాగరాజు

పులివెందుల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉద్యానతోటల్లో చిరుధాన్యాల సాగు, స్వయం ఉపాధి కల్పనపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఎద్దులయేని గ్రామ ఎస్సీ రైతులతో పాటు మండలంలోని పలు గ్రామాల రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఉచితంగా పీకేఎం-1 మునగ మొక్కలను పంపిణీ చేసి మునగ విశిష్టతను తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి మునగ ఎంతో మేలు చేస్తుందన్నారు. అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయగోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సంవత్సరం పొడవునా జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన రైతులకు జీవన ఎరువులు, చిరుధాన్యాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ రామాంజనేయరెడ్డి, డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ వినయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నియంతృత్వ చట్టాలు అప్రజాస్వామికం

● డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి

కడప కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రులు, సీఎంలు, మంత్రులు తీవ్రమైన ఆరోపణలపై అరెస్ట్ అయితే వారిని పదవుల నుంచి తొలగించాలని ప్రతిపాదించడం చూస్తే బీజేపీ నియంతృత్వ పోకడలు అవలంబిస్తోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ రూపొందించిన చట్టాలను తుంగలో తొక్కే కుట్ర జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఆరోపణలు ఎదుర్కొనే ప్రజాప్రతినిధులపై నేరం రుజువైతే చర్యలు తీసుకోవడం సరైందని తెలిపారు. రాహుల్‌గాంధీ లాంటి నాయకులను టార్గెట్ చేస్తూ అప్రజాస్వామిక బిల్లును ఆమోదింపచేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీకి ప్రధాని అయ్యే అవకాశం ఉన్నందున బీజేపీ నాయకత్వం భయపడుతోందన్నారు.

అరెస్ట్ అయితే పదవులు పోవాలా ?

పీఎం, సీఎంలు, మంత్రులు అభియోగాలపై 30 రోజుల పాటు అరెస్ట్ అయితే వారి పదవులు తొలగించేలా బీజేపీ పార్లమెంట్‌లో బిల్లు తెచ్చేందుకు కుట్ర పన్నుతుండడం రాజ్యాంగ విరుద్ధమని పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ విమర్శించారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా మైనార్టీ చైర్మన్ రహమతుల్లా ఖాన్, కమాల్‌బాషాలతో కలిసి మాట్లాడారు.

క్విజ్ పోటీలలో వైద్య విద్యార్థిని ప్రతిభ

కడపసెవెన్‌రోడ్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరచి విజయం సాధించారు. తిరుపతిలో నిర్వహించిన 2025 ఏపీస్టేట్ పల్మనాలజీ అసోసియేషన్ సమావేశం (ఏపీఎస్‌పి సీఓఎన్ 2025)లో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో కడప ప్రభుత్వ వైద్యశాల రెండవ సంవత్సరం పీజీ పల్మనాలజీ విద్యార్థిని డాక్టర్ భువనేశ్వరి ప్రథమ బహుమతి సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ నూకరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్, ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో చదువుతున్నారని, వారి ప్రతిభను గుర్తించి మరింత ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు.

పాత పింఛన్ పథకాలు అమలు చేయాలి

● సీఎంకు ఒంటేరు శ్రీనివాసరెడ్డి వినతి

కడపఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతులు, సర్వీస్ రూల్స్ పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి కోరారు. గురువారం సెక్రటేరియట్‌లో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నేతృత్వంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు నిబంధనలు కొన్ని సాంకేతిక కారణాల వల్ల అమలుకాక పోవడం వల్ల కొన్ని దశాబ్దాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు దొరకడం లేదని, ఈ సమస్యను పరిష్కరించి పదోన్నతులు కల్పించాలని కోరినట్లు చెప్పారు. 223 జీఓను రద్దు చేసి పాఠశాల సహాయకులకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతి కల్పించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల 1461 భాషా పండితులు డీఈఓ పూల్‌లో ఉన్నారని, వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు.

కళాశాలలను ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, లా, బీఎడ్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం వైవీయూలో ఆర్ఎస్ఎఫ్ మేనేజ్‌మెంట్ బ్లాక్ వద్ద విద్యార్థులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 ఏళ్లగా అరకొర నిధులతో రాష్ట్రంలోని మిగతా యూనివర్సిటీల కంటే తక్కువ నిధులు కేటాయిస్తూ వైవీయూను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులు నరసింహులు, మనోజ్, గణేష్, గోవర్దన్, బాష, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల విద్యార్థిని ప్రతిభ

కడపసెవెన్‌రోడ్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్యకళాశాల ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని శ్రేయశరత్‌కృష్ణన్ భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ప్రాజెక్టులో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని ఈ ప్రాజెక్టుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

మట్టి గణపతి విగ్రహాలు మేలు: జేసీ

కడప సెవెన్‌రోడ్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం' అనే పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో జేసీ చాంబర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ అదితిసింగ్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, వీరనాల శివకుమార్, ఉపాధ్యక్షులు నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, విజయ్, వంశీ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సీకేదిన్నె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ శారదమ్మ తెలిపారు. మండలంలోని పాపాసాహెబ్‌పేట గ్రామంలో గురువారం ఉచిత పశువైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 49 పశువులకు చికిత్స అందించడంతో పాటు 18 పశువులకు గర్భదారణ చికిత్స, 200 పైగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పశువుల యాజమాన్య పద్ధతులు తెలుసుకుని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ విజయలక్ష్మి, ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, సీకేదిన్నె సహాయ సంచాలకులు శ్రీధర్ లింగారెడ్డి, కొప్పర్తి పశువైద్యులు డాక్టర్ శిరీష, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యను అందించడమే లక్ష్యం



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, (ఇన్‌సెట్లో) సమావేశంలో మాట్లాడుతున్న చొప్పా గంగిరెడ్డి



సీకేదిన్నె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల కృషి చేస్తుందని ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. రాయచోటి రోడ్డులోని స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ కళాశాలను ఎంపిక చేసుకుని పట్టుదలతో ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. ఇంజనీరింగ్ విద్యకు అనేక రకాల అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇంజనీరింగ్ చేరే విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులన్నారు. వైస్ చైర్మన్ యల్లారెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువ యూనియన్ల పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. నాలుగేళ్లు కష్టపడి చదివి 40 ఏళ్లు జీవితంలో సుఖసంతోషాలతో ఉండవచ్చన్నారు. ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నియమ నిబంధనలను కచ్చితంగా అమలు పరుస్తూ ర్యాగింగ్ లేకుండా క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు హితేంద్ర, రంజిత్‌కుమార్ పాల్గొని విద్యా రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీకేదిన్నె సీఐగా నాగభూషణం

సీకేదిన్నె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె నూతన సీఐగా ఎం.నాగభూషణం గురువారం బాధ్యతలు చేపట్టారు. బద్వేలు సీఐగా పనిచేస్తున్న ఈయన బదిలీల్లో భాగంగా చింతకొమ్మదిన్నె సీఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న శివశంకర్‌నాయక్ బదిలీపై ఎస్‌బీకి వెళ్లారు. నూతన సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

కలిసిమెలసి జీవనం సాగించాలి

వేంపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా కులాలు, మతాలకతీతంగా కలిసిమెలిసి జీవనం సాగించాలని తహసీల్దార్ హరినాథరెడ్డి, సీఐ నరసింహులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పీస్ కమిటీ సమావేశం జరిగింది. జరగబోయే వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. ఎవరికి ఆటంకం కలుగకుండా ఇతర మతాల విశ్వాసాలకు ఆటంకం కలుగకుండా వ్యవహరించాలని తెలిపారు. పీస్ కమిటీ సమావేశంలో హిందూ, ముస్లిం పెద్దలు, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

పులివెందుల రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని వీరనారాయణ అంధుల ఆశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేముల గ్రామానికి చెందిన నారుబోయిన ఈశ్వరమ్మ 5వ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు గంగాధర్‌యాదవ్, ఆంజనేయులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్, వేముల మాజీ సర్పంచు నాగేశ్వరమ్మ, మస్తానయ్య, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

వేంపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె కందుల ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. ఫిట్టర్, సివిల్, వెల్డర్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ కోర్సులలో ఖాళీ సీట్లు ఉన్నాయని, 10వ తరగతి పాసైన, ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. సీటు కావాల్సిన విద్యార్థులు ఈ నెల 26లోగా సంప్రదించాలని కోరారు.

విద్యార్థి మృతిపై కమిటీ ఏర్పాటు

వేంపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి నరసింహనాయుడు మృతి ఘటనపై విచారణకు కమిటీని నియమించారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ హెచ్ఓడీ గోపాల్‌రాజు నేతృత్వంలో కమిటీని నియమించగా హుటాహుటిన కమిటీ ప్రతినిధులు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ చేరుకొని విచారణ చేపట్టారు. హాస్టల్ గదికి వెళ్లి విద్యార్థి ఉరివేసుకున్న ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): లింగాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్నరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీలోగా ఐటిఐ.ఎన్‌ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శాంతియుతంగా పండుగలు నిర్వహించుకోవాలి

పులివెందుల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఒకరికొకరి సహకారంతో పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ హాజీవల్లి పేర్కొన్నారు. గురువారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వినాయకచవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వినాయకచవితి ఉత్సవాల నేపథ్యంలో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నారాయణ, విష్ణు, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి : సీఐ

పెండ్లిమర్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని సీఐ చల్లనిదొర తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు. నిమజ్జనానికి వెళ్లే ప్రతి వాహనానికి రికార్డు ఖచ్చితంగా ఉండాలని, పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

భూసారాన్ని తరచూ తెలుసుకోవాలి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భూసారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా ఎరువులు వాడకంలో అనవసరపు ఖర్చు చేయకుండా నేల సారవంతాన్ని కాపాడుకుంటూ సుస్థిర దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు పేర్కొన్నారు. గురువారం వీరపునాయునిపల్లె రైతుసేవా కేంద్రంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ద్వారా రైతులకు శిక్షణ నిర్వహించారు.

ఖాళీలను భర్తీ చేయాలి: సీఐటీయూ

కడప నాగరాజుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న పోస్టులను విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతోనే భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూఈయూసీయూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. కాగా ఆగస్టు 7న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూఈయూసీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, బి.రమేష్, సాయి, సుబ్బరాయుడు, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు పాల్గొన్నారు.

లేగదూడల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

చక్రాయపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో లవణ మిశ్రమం తప్పకుండా వాడాలని, లేగదూడలకు ప్రతి నెల నట్టల నివారణ మందులు తాగించి వాటి ఆరోగ్యాన్ని సంరక్షించాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించారు. గురువారం మండలంలోని కుప్పగుట్టపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల ఉపసంచాలకుడు డాక్టర్ అమర్‌నాథరెడ్డి, జిల్లా వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకురాలు డాక్టర్ మాధవి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశువైద్యులు శివరామిరెడ్డి, వేంపల్లె పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ సి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు.

నేడు ఆలయ మూడవ వార్షికోత్సవం

లింగాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబకపల్లె గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి ఆలయం మూడవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించనున్నామని తెలిపారు.

గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, అమరావతి
రిట్ పిటీషన్ నెం.17297/2023

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ... పిటిషనర్
AND
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం & 6 మంది ఇతరులు ... రెస్పాండెంట్స్
[illegible]
కోర్టు ఆదేశానుసారం
జి. సుధీర్ కుమార్, నిమ్మల సత్యనారాయణ
న్యాయవాదులు

శివాలయంలో చవితి ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో 49వ వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు తెలిపారు. విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ 27న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, . 28న విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీ పరీక్షలు, మహిళలకు, ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. 5వ రోజు కామనూరులోని గోశాల వద్ద స్వామివారి నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

● పీస్ కమిటీ సమావేశంలో ఆర్డీవో సాయిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ వేడుకను ఎక్కడ ఎలాంటి అల్లర్లు జరుగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. గురువారం జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులకు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో వినాయక చవితి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సాయిశ్రీ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ వినాయక చవితి పండుగ రోజు నుంచి 3 నుంచి అయిదు రోజులపాటు విగ్రహాలను వినాయక ఉత్సవ కమిటీవారు కొలువు తీర్చడానికి తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. ప్రొద్దుటూరు డీఎస్పీ భావన మాట్లాడుతూ జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, తదితర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు కొలువు చేసే చోట ఆర్గనైజింగ్ కమిటీవారు అనుమతి పొందాలన్నారు. ఎవరైతే విగ్రహాన్ని కొలువు చేస్తున్నారో అలాంటివారు ముందస్తుగా ఒక యాప్ ఉంటుందని, ఆ యాప్‌ను అప్‌లోడ్ చేయడం వలన అక్కడే అనుమతి వస్తుందన్నారు.. అనంతరం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డీజేకి అనుమతి లేదని అలా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ప్రొద్దుటూరు రవిచంద్రారెడ్డి, జమ్మలమడుగు వెంకటరామిరెడ్డి, తహసీల్దార్లు గురప్ప, గంగయ్య, శ్రీనివాసరెడ్డి, శోభన్‌బాబు, నరసింహ, సీఐలు, ఎస్ఐలు, ముస్లింలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఎర్రగుంట్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకు లు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళిలు పేర్కొన్నారు. ఎర్రగుంట్ల అర్బన్ పోలీసుస్టేషన్ పరిధిలోని వినాయక విగ్రహాల నిర్వాహకులతో గురువారం సమావేశంలో వారు మాట్లాడుతూ ఎలాంటి మత ఘర్షణలకు పాల్పడకూడదన్నారు. అలాగే సూచించిన చోటే నిమజ్జనం చేయాలన్నారు.

మైలవరంలో: గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసు, విద్యుత్, తదితర శాఖల ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మైలవరం ఎస్ఐ రామసుందర్‌రెడ్డి గురువారం తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమ వివరాలను పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని తెలిపారు. మండపాల కమిటీ సభ్యులు, ప్రజలు పండుగను శాంతియుతంగా సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు.

కలసపాడులో: వినాయక చవితి పడుగ సందర్భంగా మండపాలు వినాయక విగ్రహా లను నిలుపుటకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ తిమోతి తెలి పారు. పండుగ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు విగ్రహాలు ఏర్పాటుచేస్తున్న గ్రామాల వారితో పాటు ప్రజల సహకారం అవసరమన్నారు.

పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కూటమి తరుపున మన తెలుగుబిడ్డ సుదర్శన్‌రెడ్డికి పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష పిలుపునిచ్చారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు తమ ఎంపీల ద్వారా మద్దతు ఇవ్వాలని కోరారు.

భూసార పరీక్షల మేరకు ఎరువులు వాడాలి

ఎర్రగుంట్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో భూసార పరీక్షలు అనుసరించి ఎరువులు వాడాలని ఏడీఏ ఎస్.అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. భూసార పరీక్షలు, నేల ఆరోగ్య పరిరక్షణపై ఎర్రగుంట్ల మండలంలోని తిప్పలూరులో గురువారం రైతులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. భూసార పరీక్షల వల్ల ఎరువుల వాడకం చేస్తే ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

బద్వేలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బద్వేలు ప్రాజెక్టు కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఆమేరకు బద్వేలు సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, కో కన్వీనర్ పీసీ కొండయ్య, యూనియన్ గౌరవా ధ్యక్షులు సుభాషిణి, ప్రాజెక్టు నాయకురాలు జయప్రద, కళావతి, సుభాషిణి పాల్గొన్నారు.

కొండాపురంలో: అంగన్వాడీవర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ వర్కర్లు గురువారం తహసీల్దార్ కార్యలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, అంగన్వాడీవర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు తారాదేవి, శివపార్వతి, రమాదేవి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ముద్దనూరులో:అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం సీడీపీవో కొండమ్మకు వినతి పత్రం అందజేశారు. కనీస వేతం రూ26వేలు,పనిభారం తగ్గించాలని ,పలు డిమాండ్లు చేశారు. సెక్టార్ లీడర్ పద్మావతి, విజయలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, సులోచన, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కొండాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి గురువారం కొండాపురంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సిఫారసుతో మండలంలోని 9 మందికి మంజూరైన రూ. 6 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చక్కగా పనిచేస్తోందని తెలిపారు.

నేడు ఈక్రాప్ బుకింగ్

కాశినాయన ఆగష్టు21 (ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లెలో శుక్రవారం ఈక్రాప్ బుకింగ్ నిర్వహిస్తున్నట్లు వీఏఏ నాగరత్నం తెలిపారు. రైతులు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన క్రిష్ణయ్య

బద్వేలు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బద్వేలురూరల్ సీఐగా క్రిష్ణయ్య గురువారం స్థానిక సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన బ ద్వేలు రూరల్ సీఐగా నియమితుల య్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్‌పరిధిలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెడతామని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు చేపడతామన్నారు.

అనాథశరణాలయానికి బియ్యం వితరణ

ఖాజీపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భూమాయపల్లె సమీపంలో గల అమ్మ అనాథ శరణాలయానికి గురువారం మాజీ డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రాజుసుబ్బయ్య 150 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు సేవ చేసేందుకు మరింత తోడ్పడుతామని అన్నారు. బియ్యంతోపాటు 10 కేజీల పండ్లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రఘురామిరెడ్డి, సుదీర్, మహేష్ ఓబుళరెడ్డి, సుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అటవీ సిబ్బందిపై భౌతికదాడి చేసిన వారిని శిక్షించాలని పోరుమామిళ్ల అటవీ అధికారులు డిమాండ్ చేశారు. ఆసంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు ఆదేశాల మేరకు గురువారం పోరుమామిళ్ల అటవీ కార్యాలయ ఆవరణలో ప్రొద్దుటూరు యూనిట్ వైస్ ప్రెసిడెంట్ కరుణాకర్, కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

220 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

బి.కోడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో గురువారం ఆప్తాల్మిక్ డాక్టర్ హుసేనయ్య 220 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 28 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి వారికి కంటి అద్దాల కోసం రెఫర్ చేశారు. అనంతరం వైద్యసిబ్బంది పరిసరాలు పరిశీలించి లార్వా ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్మూలించడం చేశారు.

సింగిల్ విండో ద్వారా సేవలు అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ మెంబర్లుగా ఎన్నికైనవారు అందుబాటులో ఉండి రైతులకు సేవలు అందించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సూచించారు. దువ్వూరు పీఏసీఎస్ చైర్మన్‌గా గురువారం పోలు రామమోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పించన్లు కొందరికి రాలేదనే ఆందోళన పడవద్దని తెలిపారు. వారి అర్హతకు సంబంధించిన పత్రాలను చూపితే తిరిగి పింఛను మంజూరవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీవో వెంకటసుబ్బయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజేశ్వరరావు, తెదేపా మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆ పార్టీ నాయకులు గురివిరెడ్డి, రాంబాబు, అందె శ్రీనివాసులు, పాల్గొన్నారు.

మైదుకూరు సహకార చైర్మన్‌గా పాశం మారుతి



మైదుకూరు సహకార సంఘం చైర్మన్‌గా పాశం మారుతి ప్రమాణస్వీకారం

మైదుకూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :మైదుకూరు సిండికేట్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా పాశం మారుతి కుమార్ గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సిండికేట్ బ్యాంకు వలన రైతులకు చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. అనంతరం సహకార సంఘం చైర్మన్ మారుతికుమార్ మాట్లాడుతూ ,సిండికేట్ బ్యాంకును లాభాలతో మరింత ముందుకు నడిపిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, సిండికేట్ బ్యాంకు చైర్మన్ పాశం మారుతి, మిల్లు శ్రీను, పుట్టా ప్రభాకర్‌యాదవ్, పార్టీ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, బండి అమర్‌నాథ్, తుపాకుల రమణ, ధనపాల రవి, గుండంరాజు సుబ్బయ్య, శీర్ల నాగ మోహన్, మేకల బాబు, నారాయణ పిచ్చపాటి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సొసైటీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

చాపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని అల్లాడుపల్లె రైతు సేవా సహకార సొసైటీ నూతన కమిటీ సభ్యులు గురువారం అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయం వద్ద టీటీడీ కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా సహకార శాఖ అధికారి వెంకటసుబ్బయ్య, చైర్మన్‌గా మార్తల నరసింహారెడ్డి, డైరెక్టర్లుగా మేకల సుదర్శన్, గోసుల వీరారెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టీడీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, నారపురెడ్డి, మోహన్‌యాదవ్, అక్బర్ సలీం, బయపురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

సోమిరెడ్డిపల్లె సొసైటీ చైర్మన్‌గా సాంబశివారెడ్డి ..



రిజిస్టరులో సంతకం చేస్తున్న చైర్మన్ సాంబశివారెడ్డి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా వెల్లటూరు సాంబశివారెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా నూతనంగా ఎంపికైన చైర్మన్ వెల్లటూరు సాంబశివారెడ్డి సొసైటీ డైరెక్టర్లు చాపాటి సురేశ్‌కు మార్ రెడ్డి, వెంకటేశ్వర్లు రిజిస్టరులో సంతకాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతనంగా ఎంపికైన చైర్మన్, డైరెక్టర్లకు శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలజ్ఞాన కర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం అభివృద్ధికి ప్రసాదం పథకం కింద రూ.50 కోట్లు మేరకు బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దిరసవంచ గ్రామంలో నూతనంగా లక్ష్మీ చెన్నకేశవ ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, యువ నాయకులు కాణాల మల్లికార్జునరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముడుమాలపోలిరెడ్డి, మేకల సుధాకర్, చిలమల నారాయణ, గంగరాజు, శీలం నరసింహగౌడ్, మాజీ ఎంపీపీ సుబ్బారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ చైర్మన్‌గా రమణారెడ్డి ఎన్నిక

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ వాటర్ షెడ్ కమిటీ చైర్మన్‌గా ఉప్పతి రమణారెడ్డిని 16 మంది మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వాటర్‌షెడ్డు ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి 16 మంది మెంబర్లతో పాటు స్థానికంగా ఉన్నరైతులు గ్రామసభకు హాజరైనట్లు ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డితో పాటు సర్పంచ్ భారతమ్మ, టీడీపీ నేతలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

శాంతితోనే ప్రపంచాభివృద్ధి సాధ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శాంతితోనే ప్రపంచాభివృద్ధి సాధ్యమని ఎర్రగుంట్ల ఎస్ఐ నాగమురళి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ త్రివిక్రమంరెడ్డిలు పేర్కొన్నారు. మానవత ఎర్రగుంట్ల మండలశాఖ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి ర్యాలీని గురువారం నిర్వహించారు. శాంతి కపోతాలను ఎగురవేసి ఎస్ఐ, ప్రిన్సిపాల్ ర్యాలీని ప్రారంభించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద బారీ మానవహారాన్ని ఏర్పాటు చేసి శాంతికై ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచమానవాళి శాంతిని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటి వాటి సంరక్షణ వంటి కార్యక్రమాలు యువత చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు డి.రఘురామిరెడ్డి, ఎస్.మధుసూధన్‌రెడ్డి, జి.ఉపేంద్రరెడ్డి, ఎస్‌వీ.రమణారెడ్డి, జి.మల్లికార్జునరెడ్డి, సతీష్‌కుమార్, శ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, ఓబయ్య, ఏఎంసీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, చంద్రఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు వెల్లాలలో మిగులు భూములకు వేలంపాట

రాజుపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీ వరాయస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించే పులగం బియ్యం, మిగులు భూములకు ఈ నెల 23న (శనివారం) వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటరమణ తెలిపారు. దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలం ద్వారా నిర్వహించే ఈ వేలంలో పాటదారుడు జిరాక్స్‌తో సహా హాజరుకావాలన్నారు. పతిపాటదారుడు రూ.10వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. అదే విధంగా దేవస్థానంకు సంబంధించి 11.29 ఎకరాల మిగులు భూమిని మూడేళ్లపాటు కౌలు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. పాటలో పాల్గొనేవారు రూ.5వేలు ధరా వత్తు చెల్లించాల న్నారు.

డ్రైనేజీలపై ఉన్న అక్రమ కట్టడాలు తొలగించాలి

బద్వేలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు డ్రైనేజీ కాలువలను గురువారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించి అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక ప్రజలకు పలు సూచనలు చేశారు. డ్రైనేజీ కాలవులపై శాశ్వత కట్టడాలు నిర్మించడం వలన సిల్ట్ తీయుటకు, తీసిన సిల్ట్ బయటకు తీసుకుని పోవడానికి తీవ్ర ఆటంకం జరుగుతుందన్నారు. ఇలాంటి శాశ్వత కట్టడాలను తక్షణమే స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించండి

ఖాజీపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ఎస్టీయూ ముందుంటుందన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పెన్షన్ వర్తింపజేయాలని అలాగే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబన్న, కౌన్సిలర్ వెంకటరామిరెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యుడు సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.